క్లుప్తంగా

వేలూరు -కాణిపాకం బస్సు ప్రారంభం



బస్సుకు పూజలు చేస్తున్న డిపో అధికారులు

చిత్తూరు రూరల్: ప్రయాణికుల కోరిక మేరకు చిత్తూరు నగరంలోని ఆర్టీసీ వన్‌డిపో అధికారులు శుక్రవారం వేలూరు–కాణిపాకానికి బస్సు సర్వీసును ప్రారంభించారు. డిపో మేనేజర్ క్రిష్ణమూర్తి బస్సుకు ప్రత్యేక పూజలు చేసి సర్వీసును ప్రారంభోత్సవం చేశారు. ప్రతి రోజూ ఈ సర్వీసు తొమ్మిది ట్రిప్పులు తిరుగుతుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. త్వరలో బెంగళూరు సర్వీసును ప్రారంభించనున్నట్లు తెలిపారు.

వైభవంగా ద్రౌపదీ కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ప్రజలు

పూతలపట్టు: మండలంలోని తేనేపల్లిబాట గంగమ్మ దేవాలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ద్రౌపదీ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా పంచపాండవులతోపాటు, ద్రౌపదీ దేవి ఉత్సవ మూర్తులను పరిశుభ్రం చేసి మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ వేదిక వద్దకు వేంచేపు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, భక్తిశ్రద్ధలతో కల్యాణోత్సవం నిర్వహించారు. దీనికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

సచివాలయం తనిఖీ

పూతలపట్టు: మండలంలోని వావిల్‌తోట పంచాయతీ సచివాలయాన్ని శుక్రవారం తహసీల్దార్ విజయభాస్కర్ తనిఖీ చేసారు. రికార్డులను పరిశీలించారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామాలలోని రైతుల భూ సమస్యలను సర్వేయరు, వీఆర్‌ఓలు కలిసి పరిష్కరించాలని సూచించారు. అనంతరం నాయనంపల్లిలోని ఉపాధిపనులను ఎంపీడీఓ గౌరి పరిశీలించారు.

సబ్సిడీతో డ్రోన్ పరికరాలు

ఐరాల: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ డ్రోన్ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ వరలక్ష్మి సూచించారు. ఆమె శుక్రవారం మండలంలోని గుండ్లపల్లె ఆర్బీకేలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ కిసాన్ డ్రోన్‌కు దరఖాస్తు చేసుకోవాలంటే ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పాటు కావాలన్నారు. కిసాన్ డ్రోన్ పూర్తి ధర రూ.10 లక్షలు అని, బ్యాంకు రూ.10 లక్షలకు రుణ సదుపాయం కల్పిస్తుందని తెలిపారు. ఇందులో గ్రూపు సభ్యులకు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఐదుగురు గ్రూపు రైతుల్లో ఎవరైనా రైతులు బీఎస్సీ అగ్రికల్చర్, హార్టికల్చర్ డిగ్రీ పూర్తి చేసిన రైతులకు 50 శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పొలాల్లో లారీ క్లీనర్ శవం



మోహన్ (ఫైల్)

యాదమరి: మతి స్థిమితం లేని లారీ క్లీనర్ పొలాల్లో శవమై కనిపించిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు, మండలంలోని కీనాటంపల్లె పంచాయతీ గుట్టకింద ఊరు పంట పొలాల్లో శవం ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. తమిళనాడులోకి గుడియాత్తం తాలూకా కొత్తూరుకు చెందిన రామయ్య కుమారుడు మోహన్(55) బెంగళూరులో ఐఓసీఎల్ లారీ ట్యాంకర్ క్లీనర్‌గా పనిచేసేవారు. అయితే ఇటీవల కుటుంబ సమస్యలతో మద్యానికి బానిసై, మతి స్థిమితం కోల్పోయాడు. ఈ క్రమంలోనే కీనాటంపల్లె పంచాయతీ చుట్టుపక్కల ఊళ్లలో తిరుగుతుండేవాడు. అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. వీఆర్వో సురేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సారా ఊట ధ్వంసం

గుడిపాల: చిత్తపార అటవీప్రాంతంలో సెబ్ పోలీసులు శుక్రవారం సారా స్థావరాలపై దాడులు చేశారు. చిత్తపారకు చెందిన పయణి(35)ని అరెస్ట్ చేసి, 800 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసినట్లు సెబ్ చిత్తూరు అర్బన్ సీఐ జోగేంద్ర తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు

తవణంపల్లె/పూతలపట్టు/గుడిపాల: గ్రామాల్లో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందించారు. తవణంపల్లె మండలం ఉప్పొంకలో వైద్యాధికారి మోహన్‌వేలు, పూతలపట్టు మండలం మద్దులయ్యగారిపల్లిలో డాక్టర్ ప్రవీణ, గుడిపాల మండలంలోని మందిక్రిష్ణాపురంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్ రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులను పంపిణీ చేశారు.

24 నుంచి ఆనంద మహోత్సవం

చిత్తూరు రూరల్: నగర శివారులోని ఏఎం రాజన్ మైదానంలో క్రైస్తవ ఆనంద మహోత్సవ కూటములను ఈ నెల 24 నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కిరణ్ కుమార్ తెలిపారు. బెంగళూరుకు చెందిన డార్విన్ ఎబినేషర్, నాగుర్కోవిల్కు చెందిన డేవిడ్ శ్యామ్ జాయ్సన్, మధురాంతకం యేసుదాస్ పాల్గొంటారని తెలిపారు.

సమస్యలు వింటూ..పరిష్కారం చూపుతూ.!



చిత్తూరులో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



చిల్లగుండ్లపల్లెలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని గంగనపల్లెలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. స్థానికుల సమస్యలు వింటూ వాటికి పరిష్కా రం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తూ ముందుకు సాగారు. వీధి తాగునీటి కోసం పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని, డివిజన్‌లో కొన్ని వీధులు కొత్తగా ఏర్పాటైనందున కాలువ, రోడ్డు నిర్మించాలని కోరారు. గుర్రప్పనాయుడు కాలనీలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని, సకాలంలో శానిటేషన్ చేయడం లేదని విన్నవించారు. ఆ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడాచైర్మన్ పురుషోత్తంరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, ఏఎంసీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, డివిజన్ ఇన్‌చార్జిలు గుర్రప్పనాయుడు, శ్రీరాములు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

బంగారుపాళెం: ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని కూర్మాయిపల్లె సచివాలయం పరిధిలోఉన్న చిల్లగుండ్లపల్లె, కొత్తపల్లె, గుర్రాలమిట్ట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను, ఇప్పటి వరకు ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, స్థానిక సర్పంచ్ దీప, ఎంపీటీసీ ఇందుశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుగుణాకర్‌రెడ్డి, సింగిల్ విండో, ఏఎంసీ చైర్మన్లు దత్తాత్రేయరెడ్డి, నారే సోమశేఖర్, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మొగిలీశ్వర, జిల్లా పార్టీ కార్యదర్శి శరత్‌రెడ్డితోపాటు మండలాధికారులు పాల్గొన్నారు.

చెర్లోపల్లిలో జెర్సీ పెయ్య దూడల ప్రదర్శన



బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం చెర్లోపల్లెలో శుక్రవారం సంకరజాతి జెర్సీ పెయ్యదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. పశువైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రదర్శనను ప్రారంభించి పెయ్యదూడల వృద్ధి లక్ష్యాలను, లాభాలను వివరించారు. పాల ఉత్పత్తి పెంచే దిశగా అడుగులు వేద్దామని పిలుపునిచ్చారు. పాడి పరిశ్రమ వృద్ధిపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వారు పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ పాడిరైతులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ప్రతిమారెడ్డి, పశువైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శి శివరాజు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

యాదమరి: మండలంలోని మహావీర యానాది కాలనీలో పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పాఠశాలలో సరస్వతీ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. దీనికి హాజరైన ఎంఈవో రుక్మిణి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, పెన్నులు, పలకలు, బ్యాగ్‌లు, షూలు, యూనిఫాం అందిస్తున్నట్లు వివరించారు. ఎంఈఓను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. క్రీడల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం సుబ్రమణ్యం పిళ్లై ఉపాధ్యాయులు తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల వారీగా తనిఖీలు

గుడిపాల: పాఠశాలల వారీగా సామాజిక తనిఖీలు నిర్వహించాలని ఎంఈవో రామ్‌నాయక్ తెలిపారు. ఎంఆర్‌సీ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సామాజిక తనిఖీలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి, నాడు–నేడుపై పేరెంట్స్ కమిటీతో సమావేశాలు నిర్వహించి తెలుసుకోవాలన్నారు. ఏప్రిల్ 24 నుంచి 28వ తేదీ లోపల అన్ని పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ సారథి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

లోకోస్ సేవలు విస్తృతం చేయాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలోని స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేవీలతో పాటు సమగ్ర వివరాలను క్రోడీకరించేలా రూపొందించిన లోకోస్ యాప్ సేవలు విస్తృతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ తులసి తెలిపారు. స్థానిక జిల్లా సమాఖ్య సమావేశ భవనంలో శుక్రవారం లోకోస్ యాప్ వినియోగంపై ఏపీఎం, సీసీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ లోకోస్ యాప్‌ను రాష్ట్రంలోనే మొదటగా చిత్తూరు జిల్లాలో వినియోగిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం డిజిటలైజేషన్ ప్రక్రియ ఊపందుకుందని, ఇలాంటి తరుణంలో విధిగా స్వయం సహాయక సంఘాల సమగ్ర వివరాల కోసం లోకోస్ యాప్‌ను వినియోగించాలని స్పష్టం చేశారు. ఇందుకోసం ముందస్తుగా ఏపీఎంలు, సీసీలు యాప్‌లో వినియోగంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు ఆయా గ్రామాల పరిధిలోని సంఘమిత్రలు, సంఘాల నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎంలు, డీపీఎంలు పాల్గొన్నారు.

ఇంటింటా 'జగనన్నే మా భవిష్యత్'

పూతలపట్టు/బంగారుపాళెం/గుడిపాల: గ్రామాల్లో ఇంటింటా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం శుక్రవారం కొనసాగింది. పూతలపట్టు మండలం కొర్లమిట్ట, పంబళ్లపల్లిలో కో–ఆప్షన్‌మెంబరు ఖాదర్ వల్లి, సర్పంచ్ మాసిలామణి, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, సచివాలయ కన్వీనర్ జేజిరెడ్డి పాల్గొన్నారు. బంగారుపాళెం మండలం పాలేరు పంచాయతీ నేతాజీ నగర్‌లో వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శరత్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. గుడిపాల మండలం వసంతాపురం, చీలాపల్లె పంచాయతీల్లో నాయకులు సాయి, రెడ్డెప్ప, శ్రీరాములు, విశ్వనాథరెడ్డి, సుశేంద్రారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే

తవణంపల్లె: ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సీహెచ్‌ఓ వెంకటరమణ తెలిపారు. ఆయన శుక్రవారం మండలంలోని ఎగువ తవణంపల్లెలో పారిశుధ్య పనులను పరిశీలించారు.

జెడ్పీటీసీ సభ్యుడికి పరామర్శ



గుడిపాల: బైరెడ్డిపల్లె మండలం జెడ్పీటీసీ కేశవులు రోడ్డు ప్రమాదంలో గాయపడి, చీలాపల్లె సీఎంసీలో చికిత్స పొందుతున్నారు. ఆయన్ని శుక్రవారం జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

రంజాన్‌కు ముస్తాబు

చిత్తూరు రూరల్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని చిత్తూరు నగరంలోని పలు మసీదులు శుక్రవారం ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలంకరణతో ప్రత్యేక శోభను సంతరించుకుంటున్నాయి. శనివారం ఉదయం జరిగే ప్రత్యేక ప్రార్థనల కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు.

వర్షంతో ఉక్కపోత నుంచి ఉపశమనం



బంగారుపాళెంలో కురుస్తున్న వర్షం

చిత్తూరురూరల్/బంగారుపాళెం/యాదమరి/పూతలపట్టు: జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో శుక్రవారం గాలివాన బీభత్సం సృష్టించింది. చిత్తూరు మండలంలో ఉదయం నుంచి ప్రతాపం చూపిన భానుడు మధ్యాహ్నం తరువాత కనుమరుగయ్యాడు. మధ్యాహ్నం నుంచి గంట పాటు కురిసిన వర్షానికి రోడ్లంతా జలమయంగా మారాయి. ఈ వర్షానికి ఉక్కపోత నుంచి జనానికి ఉపశమనం లభించింది. బంగారుపాళెంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. గాలికి దుకాణాలపై వేసిన ప్లాస్టిక్ రేకులు ఎగిసి రోడ్డుపై పడ్డాయి. మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. యాదమరి మండల పరిధిలో కురిసిన వానకు వాతావరణం చల్లబడింది. పూతలపట్టు మండలంలోనూ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల మామిడి కాయలు, చింతకాయలు నేల రాలిపోయాయి.